క్లుప్తంగా

ఎస్సై రామకృష్ణకు సత్కారం


రామకృష్ణను సత్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా పతకానికి ఎంపికైన అమలాపురం ఎస్పీ కార్యాలయం డీటీఆర్‌బీ ఎస్సై జి.రామకృష్ణను స్థానిక ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ సత్కార సభలో ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి ఆజాద్ నాగ సుధా కొండలరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఎస్సై రామకృష్ణ పోలీసు శాఖ, ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థల నుంచి ఎన్నో అవార్డులు అందుకున్నారని పేర్కొన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు బి.నాని, కానిస్టేబుల్ విజయశంకర్ ఎస్సై రామకృష్ణ సేవలను అభినందించారు.

అంబేడ్కర్‌కు నివాళి


గొల్లవిల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి ఇందిరానగర్‌లో మంగళవారం నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132 జయంతి వేడుకల్లో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు, నరేష్, చప్పిడి దుర్గారావు, అరిగెల నానాజీ పాల్గొన్నారు.

24న కాంగ్రెస్ చలో విజయవాడ

అమలాపురం టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటంలో భాగంగా ఈ నెల 24న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టిందని ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు వెల్లడించారు. ఆ రోజు విజయవాడలో జరిగే జై భారత్ సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని జిల్లా పార్టీ శ్రేణులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్‌ను రుద్రరాజు, జిల్లా పార్టీ నాయకులు మంగళవారం విడుదల చేశారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్

యానాం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మంగళవారం ట్రెయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. చెన్నైకు చెందిన రామ్‌సేస్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాల ఫైనలియర్ విద్యార్థులు ఈసీఈ, సీఈ, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. 90 మందికి ఇంటర్వ్యూలను నిర్వహించారు. సంస్థ హెచ్‌ఆర్ కమలనాథ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ బాల, ప్రిన్సిపల్ వేలాయుధం, ట్రెయినింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎ నాగఅజ్మీరా పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు

తాళ్లరేవు: క్రీం స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు ఆధ్వర్యంలో మంగళవారం తాళ్లరేవులో నిర్వహించిన మెగా నేత్ర వైద్య శిబిరంలో సుమారు 400 మంది రోగులను పరీక్షించి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. పిఠాపురం సీఎంసీ నేత్ర ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఒంటితాడి సర్పంచ్ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఆత్మహత్య


రాము మృతదేహం

యానాం: పట్టణ పరిధిలో ఓ వ్యక్తి సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శేరు నూకరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దార్థనగర్‌లో నివాసం ఉంటున్న పేరాబత్తుల రాము(38) స్థానిక మట్టాగార్డెన్స్ ఫ్లడ్‌బ్యాంక్ రోడ్డులో మెడకు తాడు బిగించుకుని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం స్థానికులు ఈ విషయం తెలపడంతో పోలీసులు వెళ్లి మృతదేహాన్ని స్థానిక జీజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి వుందని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

పేరూరులో చోరీలు

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం పేరూరు పంచాయతీ పరిధిలోని కొంకాపల్లిలో మంగళవారం తెల్లవారుజామున దొంగలు నాలుగు దుకాణాల్లో చోరీలు జరిగాయి. నాలుగు షాపుల షట్టర్లు దొంగలు పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. అయితే దుకాణాల్లో స్వల్పంగా ఉన్న నగదు మాత్రమే చోరీ అయింది. దుకాణాల యాజమానులు ఇచ్చిన సమాచారంతో అమలాపురం పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఒకేసారి నాలుగు దుకాణాల్లో దొంగలు చోరీలకు పాల్పడంపై దుకాణదారులు ఆందోళనకు గురయ్యారు. దుకాణాల్లో ఎక్కువ నగదు ఉంటుందని భావించిన దొంగలు ఈ చోరీలకు పాల్పడినట్టు తెలిసింది. ఈ చోరీలపై ఒక దుకాణదారు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి తెలిపారు.

వెలుగుల సౌరభం

- గ్రామాల్లో సోలార్ విద్యుత్ కాంతులు
- సీఎస్‌ఆర్ నిధులతో మూడు దశల్లో యూనిట్లు
- పంచాయతీలకు విద్యుత్ చార్జీల నుంచి ఉపశమనం


మొగళ్ళమూరు ప్రధాన వీధుల్లో సోలార్ వెలుగులు

అల్లవరం: సౌర విద్యుత్తుతో ఆ గ్రామాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన సోలార్ ప్లేట్లు సూర్యశక్తిని గ్రహించి విద్యుత్‌గా మార్చి వెలుగులను అందిస్తున్నాయి. పగటి పూట సూర్యరశ్మి నుంచి శక్తిని గ్రహించి కేవలం రాత్రి వేళల్లో మాత్రమే విద్యుత్ దీపాలు వెలిగేలా కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో లైట్లను తయారు చేశారు. గ్రామాల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ చొరవతో గెయిల్ ఇండియా లిమిటెడ్ (రాజమహేంద్రవరం) సీఎస్‌ఆర్ నిధులతో సోలార్ విద్యుత్ దీపాలను మూడు దశల్లో నిర్మాణ పనులు చేపట్టారు. తొలి దశలో సీఎస్‌ఆర్ నిధులు రూ.25 లక్షలతో గోడిలంక, తుమ్మలపల్లి, బెండమూర్లంక వరకు ప్రధాన రహదారి పొడవునా 98 యూనిట్ల సోలార్ లైట్లు అమర్చారు. రెండో దశలో మరో రూ.25 లక్షలతో మొగళ్లమూరు, గోడి, గోడితిప్ప గ్రామాల్లో 98 యూనిట్లను ఏర్పాటు చేశారు. మూడో దశలో మరో రూ. 25 లక్షలతో 216 జాతీయ రహదారి వైనతేయ నదిపై నిర్మించిన బోడసకుర్రు–పాశర్లపూడి బ్రిడ్జి పొడవునా సోలార్ లైట్లు ఏర్పాటు చేసేందుకు ఓఎన్‌జీసీ సీఎస్‌ఆర్ నిధులతో ఎంపీ అనురాధ ప్రతిపాదనలు చేశారు. త్వరలో బ్రిడ్జిపై సోలార్ లైట్ల నిర్మాణ పనులు ప్రారంభకానున్నాయి. సోలార్ లైట్ల నిర్మాణం, వాటి నిర్వహణ కాకినాడకు చెందిన నీడ్ క్యాప్ కంపెనీ చేపట్టింది.

విద్యుత్తు బిల్లుల సమస్యకు చెక్

సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటుతో ప్రధాన రోడ్లు, వీధులు వెలుగులను విరజిమ్ముతున్నాయి. సోలార్ వీధి దీపాలు అమర్చిన గ్రామాల్లో వీధి దీపాల సమస్యకు తెరపడింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన వీధి దీపాలతో పంచాయతీలకు విద్యుత్ చార్జీలు, నిర్వహణ తలకి మించిన భారంగా మారింది. పైగా పగలు, రాత్రి తేడా లేకుండా లైట్లు వెలగడం, వాటిని నియంత్రించే టెక్నాలజీ పంచాయతీలకు లేకపోవడంతో ప్రతి నెలారూ.వేలల్లో వచ్చే విద్యుత్ బిల్లులు పంచాయతీలకు భారంగా ఉండేవి. దీంతో ఈ వ్యవస్థ విఫలమైంది. పంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం నివారించేందుకు సౌర విద్యుత్ దీపాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

గ్రామ అవసరాలు గుర్తించారు



గ్రామస్తుల అవసరాలను గుర్తించి సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. నదీ పరివాహక ప్రాంతాన్ని ఆనుకుని సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. సోలార్ లైట్లతో ఇన్నాళ్లూ పడిన కష్టాలు తీరాయి.

– కొల్లు వేణుగోపాల్, గోడితిప్ప

పంచాయతీలకు భారం తగ్గుతుంది



కరెంట్‌తో పనిలేకుండా రాత్రి వేళల్లో నిర్విరామంగా సౌర విద్యుత్తుతో లైట్లు వెలుగుతున్నాయి. గోడిలంకలో గ్రామంలో 30 యూనిట్లు ఏర్పాటు చేశారు. మా గ్రామంలో వీధులన్నీ సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తే పంచాయతీలకు విద్యుత్ చార్జీల భారం తగ్గుతుంది.

– వడ్డి గంగ, వైస్ ఎంపీపీ, గోడిలంక

గ్యాస్ గోడౌన్లు, పెట్రోలు బంకుల్లో అప్రమత్తత అవసరం


ముమ్మిడివరంలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అమలాపురం టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అమలాపురం అగ్నిమాపక దళం పట్టణంలోని గ్యాస్ గోడౌన్లు, పెట్రోలు బంకుల వద్ద మంగళవారం ప్రదర్శనలు చేసి పలు జాగ్రత్తలను సూచించింది. ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక దళాధికారి కేవీ మురళి కొండబాబు స్పష్టం చేశారు. గోడౌన్ల వద్ద పనిచేసే సిబ్బంది, గ్యాస్ సిలిండర్లను ఇంటింటికి సరఫరా చేసేవారికి పలు సూచనలు చేశారు. పెట్రోలు బంకుల వద్ద వాహనాల్లో పెట్రోలు, డీజిల్ నింపుతున్నప్పుడు ఎదురయ్యే ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక దళం లీడింగ్ ఫైర్‌మెన్ ఎం.బలరామ్, సిబ్బంది ఈ సందర్భంగా పలు యంత్రాలు, పరికరాలతో ప్రయోగాత్మకంగా ప్రదర్శించి చూపించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ముమ్మిడివరం: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ముమ్మిడివరం అగ్ని మాపక కేంద్రం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. స్థానిక పెట్రోలు బంక్‌లు, ఎల్‌పీజీ గ్యాస్ కంపెనీల వద్ద అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఫైర్‌మన్ ఎస్.గంగన్నదొర ఆధ్వర్యంలో సిబ్బంది ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా లక్షపత్రి పూజ

ఐ పోలవరం: మురమళ్లలో వీరేశ్వరస్వామివారికి చైత్రమాస శివరాత్రి మహాపర్వదినం పురస్కరించుకుని మంగళవారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణమూర్తి, అర్చకులు ఉండిదత్తుశర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమంలో తొలుత గణపతి పూజ, మహాన్యాసక పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అనంతరం బిల్వార్చన కార్యక్రమం జరిగింది. ప్రతి మాసశివరాత్రికి ఆలయంలో భక్తులు గోత్ర నామాలతో దేవస్థానం తరపున లక్షపత్రిపూజ జరుపుతారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

యానాం: పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు వ్యక్తిగతంగా హాజరయి గెజిటెడ్ అధికారి ఇచ్చిన లైఫ్ సర్టిఫికెట్‌ను సబ్ ట్రెజరీల ద్వారా సమర్పించాలని పుదుచ్చేరి అకౌంట్స్ అండ్ ట్రెజరీస్ డైరెక్టర్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ డిజిటలైజ్డ్ లైఫ్ సర్టిఫికెట్‌ను జీవన్ ప్రమాణ్ వెబ్ సైట్ ద్వారా సమర్పించవచ్చునన్నారు. ఈ ఏడాది మే 31 కంటే ముందు లైఫ్ సర్టిఫికెట్‌ను అందించకపోతే తదుపరి పెన్షన్ చెల్లింపు సాధ్యం కాదన్నారు. మరిన్ని వివరాలకు ×డిఎటి.పివై.జిఒవి.ఇన్× వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం


నీటి సమస్యపై అధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న ఎంపీడీవో గౌరీకుమారి

ఉప్పలగుప్తం: వానపల్లిపాలెం గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి అన్నారు. మండలంలోని వానపల్లిపాలెం గ్రామంలో వినాయక గుడి సెంటర్‌లో తాగునీరు సక్రమంగా అందటంలేదని గ్రామస్తులు ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకీరాంబాబు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎంపీపీ జానకీ విషయం పరిష్కరించాలని ఎంపీడీవో గౌరీకుమారిని ఆదేశించటంతో మంగళవారం గ్రామానికి వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్, కార్యదర్శి వి.వి.వి.సత్యనారాయణతో ఫోన్లో మాట్లాడి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోజు విడిచి రోజు ట్యాంకర్ ద్వారా తాగునీరు అందిస్తామని ఎంపీడీవో చెప్పారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లా నాయుడు, సూర్యప్రకాష్, వెంకటనారాయణ, రామకృష్ణ, నరసింహారావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా మెలగాలి


కోరంగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

తాళ్లరేవు: విధి నిర్వహణలో బాధ్యతగా మెలగుతూ ప్రజలకు సత్వర సేవలందించాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన కోరంగి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ ఆయనకు స్వాగతం పలికిన అనంతరం సిబ్బందిని పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి న్యాయం చేయాలన్నారు. అనంతరం ఆయన జాతీయ రహదారి 216లోని పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు.

30 వరకూ వామపక్షాల నిరసన


అమలాపురంలో విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాల్యాద్రి

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ అనుకూల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకూ వామ పక్షాలపై సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంద్రం మాల్యాద్రి, డేగ ప్రభాకర్‌లు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో ఆ రెండు పార్టీల ప్రతినిధులు మంగళవారం ఉమ్మడిగా సమావేశమై ఉద్యమ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. అనంతరం వారు ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, ఆ పార్టీల జిల్లా నాయకులు పి.వసంతకుమార్, దేవ రాజేంద్రప్రసాద్, మోకా శ్రీను, సికిలే సూర్యనారాయణ ప్రసంగించారు.

ప్రచార యాత్ర

ముమ్మిడివరం: కమ్యూనిస్టులు మంగళవారం ముమ్మిడివరంలో ప్రచార యాత్ర నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంచి పెడుతూ కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. జి.దుర్గాప్రసాద్, సూర్యనారాయణ, బాలయ్య, వీరరాఘవులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల వేదికలో ఫిర్యాదులు


చైర్మన్ గోపాలకృష్ణకు ఫిర్యాదు అందిస్తున్న వినియోగదారులు

యానాం: నియోజకవర్గ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు మంగళవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో కన్జ్యూమర్ గ్రీవెన్స్‌సెస్ రీడ్రెస్సల్ ఫోరమ్ ఆధ్వర్యంలో పరిష్కార వేదిక నిర్వహించారు. చైర్మెన్ గోపాలకృష్ణ, ఏఈ లంక కృష్ణారావు, మెంబరు జితేందర్, అడ్వకేట్ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు లోఓల్టేజి సమస్యలు, నూతన మీటర్ల ఏర్పాటు, పలు మీటర్లు పనిచేయకపోవడం తదితర సమస్యలపై ఫిర్యాదులను అందజేశారు. 20వరకు ఫిర్యాదులు రాగా నాలుగు కేసులను నమోదు చేశారు. 15రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

ఆల్‌ఇండియా ట్రేడర్స్ సమావేశంలో యానాం వ్యాపారులు


సదస్సులో పాల్గొన్న యానాం వ్యాపార ప్రతినిధులు

యానాం: దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెల 18,19 తేదీల్లో ఆల్‌ఇండియా ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి సమావేశానికి పుదుచ్చేరికి ప్రాతినిధ్యం వహించేందుకు యానాం నుంచి పుదుచ్చేరి ట్రేడర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్ నేతృత్వంలో 30 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 500 మంది ప్రతినిధులు మొదటిరోజు సమావేశానికి హాజరయ్యారన్నారు. ఈ సమావేశంలో వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలు చర్చించామన్నారు.

లారీ–టిప్పర్ ఢీ

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో చొల్లంగిపేట వివేకానంద స్కూల్ వద్ద మంగళవారం తెల్లవారుజామున లారీ–టిప్పర్ ఢీకొన్నాయి. కాకినాడ వైపు నుంచి యానాం వైపుకు కంకర లోడుతో వెళుతున్న టిప్పర్ ముందు వెళుతున్న వాహనం సడన్ బ్రేక్ వేయడంతో, ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో టిప్పర్ రహదారి చెంతన బోల్తా పడింది. టిప్పర్ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

జాతీయ రహదారి 216లోని తాళ్లరేవు బైపాస్ పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో జిత్తుక రమేష్(30)మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు శివారు కోలగర్రు గ్రామానికి చెందిన రమేష్ అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో యానాం నుంచి కాకినాడ వెళుతూ డివైడర్‌ను ఢీకొట్టాడు. కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రూ.20లక్షలతో పూడిక పనులకు ప్రతిపాదనలు


పథకాల లబ్ధి కరపత్రాలను అందజేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: తాండవపల్లి గ్రామంలో గేదెల కోడు డ్రెన్‌కు రూ.20 లక్షలతో పూడిక పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. తాండవపల్లి గ్రామంలో సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో మంగళవారం ఆయన అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. గేదెలకోడుడ్రైన్ మూసుకుపోవడం వల్ల గ్రామంలో ఖరీఫ్‌లో 250 ఎకరాల వరి చేలకు ముంపు సమస్య ఉందని రైతు గంగుమళ్ల సత్యనారాయణ డాక్టర్ శ్రీకాంత్‌కు వివరించగా ఆయన డ్రైనేజీ శాఖ డీఈఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో

తాండవపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం

గడప గడపకూ వెళ్లి నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన కరపత్రాలను అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టాబోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, రూరల్ కార్యదర్శి సూదా గణపతి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు కేతా భానుతేజ, గ్రామ అధ్యక్షుడు పరమట శ్రీను, ఉప సర్పంచ్ గుత్తుల సత్యనారాయణ, ఎంపీడీవో కాశీ విజయ ప్రసాద్, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి పాల్గొన్నారు.

రామకృష్ణారావుకు సేవారత్న బిరుదు


రామకృష్ణారావును సేవారత్న బిరుదుతో సత్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు తదితరులు

అమలాపురం టౌన్: నాలుగు దశాబ్దాలుగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న అల్లవరం మండలం బెండమూర్లంక గ్రామానికి చెందిన గుర్రం రామకృష్ణారావును పలు సంస్థలు అమలాపురంలోని సాయి సంజీవని ఆస్పత్రి ఆడిటోరియంలో మంగళవారం సత్కరించాయి. కోనసీమ రచయితల సంఘం, జిల్లా శ్రీశ్రీ కళావేదిక, సాయి సంజీవని వాకర్స్ యోగా హెల్త్ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రామకృష్ణారావుకు సేవా రత్న బిరుదును ప్రదానం చేసి సత్కరించాయి. సభకు ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు మాట్లాడుతూ రామకృష్ణారావు లయన్స్ క్లబ్ ప్రతినిధిగా, సినీనటుడిగా, సామాజిక, ఆధ్యాత్మిక సేవా ప్రతినిధిగా పలు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, సర్ సీవీ రామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, కోనసీమ మహిళా మండలి ప్రతినిధి పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

ఉప్పలగుప్తం: మద్దతు ధర అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని భీమనపల్లి ప్రాథమిక సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 4,687 ఎకరాల్లో ఎంసీ 13 హైబ్రీడ్ ప్రైవేటు బొండాలను సాగు చేయగా, 1,990 ఎకరాల్లో ఎంటీయూ 1121 సన్నరకపు ధాన్యాన్ని రైతులు సాగు చేశారని తెలిపారు. ఇప్పటికే 59.9 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతుకు కనీస మద్దతు ధర లభించేలా కామన్‌రకానికి ప్రభుత్వం 75 కేజీలకు రూ.1,530 ప్రకటించిందన్నారు. సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, వ్యవసాయ మండలి చైర్మన్ మానే శ్రీను, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, రైతులు కొళ్లపల్లి పట్టాభిరాముడు, యాళ్ల చిన్నా, పాటి వెంకటరమణ, దొడ్డిపట్ల దుర్గారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సత్యాగ్రహ దీక్ష


శిబిరంలో మాట్లాడుతున్న ఏపీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు

అమలాపురం రూరల్: ప్రధానమంత్రి మోదీ పలు ప్రైవేటు కంపెనీలకు దేశ సంపదను దోచుపెడుతున్నందుకు నిరసన వ్యక్తం చేస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు జై భారత్ సత్యాగ్రహ దీక్షను మంగళవారం చేపట్టారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ దీక్షా శిబిరానికి ఏపీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ కార్యదర్శి గిడుగు రుద్రరాజు ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటిద్దు బాబి, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఏపీసీసీ ప్రతినిధి అయితాబత్తుల సుభాషిణి ప్రసంగించారు. ఏపీసీసీ కో ఆర్డినేటర్ కేబీఆర్ నాయుడు, ఏఐసీసీ సభ్యులు చీకట్ల అబ్బాయి పాల్గొన్నారు.

ఇక లో ఓల్టేజ్‌కి చెక్

నేడు 5 ఎంవీఏ పీటీఆర్ స్థానంలో 8 ఎంవీఏ పీటీఆర్ ఏర్పాటు

అల్లవరం: దేవగుప్తం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్యకు చెక్ పెట్టి పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఐదేళ్ల క్రితం దేవగుప్తం హైస్కూల్‌ను ఆనుకుని సబ్ స్టేషన్ నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణంతో దేవగుప్తం పరిసర గ్రామాలకు పూర్తి స్థాయిలో కరెంట్ సరఫరా అవుతుందని అందరూ ఆశించారు. అయితే ఈ సబ్ స్టేషన్ పరిధిలో వేలాది ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. వేసవి కాలం వచ్చిందంటే లోఓల్టేజీతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సబ్‌స్టేషన్‌లో బుధవారం 5 ఎంవీఏ పీటీఆర్ స్థానంలో 8 ఎంవీఏ పీటీఆర్ ఏర్పాటు చేస్తామని ఈఈ రవికుమార్ తెలిపారు.

దీంతో దేవగుప్తం సబ్ స్టేషన్ పరిధిలోని దేవగుప్తం, డి.రావులపాలెం, గుండెపూడి, సామంతకుర్రు, తూర్పులంక గ్రామాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, ఆక్వా, గృహ విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు.

ఉదయం మంచు.. మధ్యాహ్నం దంచుడు


కోతకు సిద్ధమైన వరిచేలపై అలముకున్న మంచు తెరలు


గొల్లవిల్లి పాఠశాలకు మంచులో వెళుతున్న విద్యార్థులు

ఉప్పలగుప్తం: ఉదయాన్నే తూర్పు దిక్కున ఉదయించాల్సిన భానుడు మంచుతెరలు చాటున దోబూచులాడుతున్నాడు. చల్లటి వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదించేలోపు భగభగ మంటూ తన ప్రతాపం చూపుతున్నాడు. ఈ పరిస్థితి నాలుగు రోజులుగా ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మధ్యాహ్నం నుంచి ఎండలు దంచేస్తూ, విపరీతమైన వేడి గాలులు వీస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉప్పలగుప్తంలో మంగళవారం కనిపించిన దృశ్యాలివీ..

పీడీ స్వామి దంపతులకు సత్కారం

తాళ్లరేవు: జి.వేమవరం జెడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్ఆర్‌కేవీ స్వామి దంపతులను మంగళవారం సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా స్థానిక పాఠశాల ప్రాంగణంలో హెచ్‌ఎం జి.నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు వై. అప్పారావు, ఉపసర్పంచ్ ఎం. లింగమూర్తి, పీఎంసీ చైర్మన్ ఎ. శ్రీను పాల్గొన్నారు.